క్లుప్తంగా

పాఠశాలల్లో పారిశుద్ధ్యం



తాగునీటి ట్యాంక్ వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

మీర్‌పేట: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధి ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టామని కమిషనర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం చింతల్‌కుంట, హుడాకాలనీ, దాతునగర్ బడుల్లో.. మున్సిపల్ సిబ్బంది వాటర్ ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేశారు. పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం 5వ డివిజన్ ఆదిత్యనగర్, ఓంసాయినగర్ కాలనీల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టిని, వ్యర్థాలను గల్ఫర్‌మిషన్ ద్వారా తీసివేశారు. కార్యక్రమంలో డీఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యానికి కృషిచేయాలి

మున్సిపల్ కమిషనర్ వాణి



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వాణి, అధికారులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో సంపూర్ణ పారిశుద్ధ్యానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ ఏ.వాణి సూచించారు. బుధవారం పుర పరిధిలోని రావిర్యాలలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 10వ రోజు 2వ వార్డులో పరిసరాల-పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మ్యాన్ హోల్స్, నాలాలను పరిశుభ్రం చేయంచామన్నారు. తుక్కుగూడ- శ్రీశైలం జాతీయ రహదారిపై నిబంధనలు పాటించని హోటళ్లకు రూ.2000ల జరిమాన విధించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశ్, వార్డు అధికారి మనోహర్, ఈఈ ప్రశాంత్, పుర సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నష్టాలను పూడ్చుకునేందుకు విద్యార్థులపై భారమా..

ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థ పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను తగ్గించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నాయకులు డిపో సీఐ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్‌పాస్ చార్జీలు ఇప్పటికే ఆకాశాన్ని అంటుతున్నాయని, మళ్లీ పెంచాలని చూడటం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడమేనన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్ హామీ కారణంగా వస్తున్న నష్టాలను పూడ్చుకునేందుకే విద్యార్థులపై భారం మోపుతున్నారన్నారు. విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు వెంటనే తగ్గించాలని, లేనియెడల విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

మంత్రి వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షలు

షాబాద్: మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు, పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బేగరి రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు మహేశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

కేశంపేట: కేంద్రంలో ప్రధాని మోదీ హయాంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్ల రాధిక అన్నారు. మండల కేంద్రంలో బుధవారం 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం సంకల్పంతో సాకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొండ్ర కొమురయ్యతో పాటు రాధిక ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని వారు కోరారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 21 యోగా డేను ఘనంగా నిర్వహించాలన్నారు. అలాగే 23న శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో రఘురాంగౌడ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జంక్షన్ల ఆధునీకరణ

- సుందరీకరణకు కార్పొరేషన్ గ్రీన్ సిగ్నల్
- ఆరు కూడళ్ల గుర్తింపు
- త్వరలో పనులు ప్రారంభం



బడంగ్‌పేట కూడలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ సుందరీకరణకు అధికార యంత్రాంగం కార్యాచరణ మొదలు పెట్టింది. ఆరు కూడళ్లను.. 100 రోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. బడంగ్‌పేట మున్సిపాలిటీని అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, బడంగ్‌పేట, బాలాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి, బాలాపూర్ పార్టు, కుర్మల్‌గూడ గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలోని ఆమ్లెట్ గ్రామాలను కలుపుకొని 2013లో ఏర్పాటు చేశారు. అనంతరం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. గతంలో కార్పొరేషన్‌లోని బాలాపూర్ పెద్ద చెరువు, నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు, కుర్మల్‌గూడలోని అంతిరెడ్డి చెరువు, అల్మాస్‌గూడలోని పోచమ్మకుంట చెరువులను ఆధునికీకరించారు. వీటితో పాటు బడంగ్‌పేట చారిత్రక బట్టేల్‌గుట్టను మెరుగు పరిచారు. ఇప్పుడు కూడళ్ల వంతయింది.

ఆహ్లాదంగా పార్కులు!

బడంగ్‌పేటలోని పాత కచ్చేర్ చౌరస్తా, అల్మాస్‌గూడ రాజీవ్‌గృహకల్ప అంబేడ్కర్ కూడలి, బాలాపూర్ వెళ్లే శివాజీ చౌక్ కూడలి, నాదర్‌గుల్, గాంధీనగర్, గుర్రంగూడలోని చౌరస్తాలతో పాటు మరికొన్ని ప్రాంతాలను బ్యూటిఫికేషన్ చేసేందుకు కార్పొరేషన్ యంత్రాంగం నిర్ణయించింది. వీటి నవీకరణకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపగా.. ఆయన అంగీకరించారని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. వెంచర్లల్లో వదిలివేసిన పార్కు స్థలాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, కార్పొరేషన్ ప్రజలు సేదతీరేలా చర్యలు చేపట్టాలని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ఇప్పటికే మల్లాపూర్, సుల్తాన్‌పూర్ రోడ్లను ఆర్‌సీఐ పరిధిలోకి తీసుకుని, సుందరీకరించిన సంగతి తెలిసిందే. తెలంగాణలో కార్పొరేషన్లలో మూడో స్థానంలో ఉన్న బడంగ్‌పేటను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం చాలా అవసరమని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

పనులు మొదలు పెడతాం



కార్పొరేషన్ సుందరీకరణకు కృషి చేస్తున్నాం. అందుకు కలెక్టర్ సమ్మతించారు. జంక్షన్లను గుర్తించాం. వందరోజుల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పనులు పూర్తి చేసే ప్రయత్నం చేస్తున్నాం. అందరూ సహకరించాలి.

– పి.సరస్వతి, కమిషనర్

కష్టపడిన వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తప్పకుండా పార్టీ పదవులు దక్కుతాయని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం, కందుకూరు మండలాల అధ్యక్షులు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల బ్లాక్ అధ్యక్షుల నియామకాలకు స్థానిక నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్యన ఉండే వారికి గుర్తింపు, పదవులు ఇవ్వాలని పార్టీ భావిస్తుందన్నారు. ఈ నియామకాలకు గాంధీభవన్ నుంచి పరిశీలకులుగా శివసేనారెడ్డి, ధారాసింగ్ వచ్చారన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కాకుండా పాత వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే.శివసేనారెడ్డి, పరిశీలకులు ధారాసింగ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బడంగ్‌పేట మాజీ మేయర్ చిగురింత పారిజాత, నాయకులు ఏనుగు జంగారెడ్డి, గోగికర్ జానకీరామ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

హయత్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఓ ప్రైవేటు పాఠశాలను సీజ్ చేసినట్లు హయత్‌నగర్ మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. హయత్‌నగరలోని కుంట్లూర్ రోడ్డులో ఉన్న రవింద్రభారతి పాఠశాలను శ్మశాన వాటిక పక్కన ఏర్పాటు చేయడమే కాకుండా గుర్తింపును మార్పు చేసుకోలేదు. ఈ విషయంపై భారీగా ఫిర్యాదులు వచ్చాయి. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డీఈఓల నుంచి ఆదేశాలు అందడంతో పాఠశాలను సీజ్ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. గుర్తింపు లేకుండా పాఠశాలలను నిర్వహిస్తే చర్యలు తప్పవని, హెచ్చరించారు.

ఘనంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన సందర్భంగా తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ, సిద్ధార్థశర్మ నేతృత్వంలో ఎల్‌బీనగర్‌లోని సువర్ణభారతి గోశాలలో బుధవారం చండీయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి, సీనియర్ నేతలు మీనాక్షి గిరిధారి, కల్యాణి హాజరై మాట్లాడారు. కొవిడ్ లాంటి విషమ పరిస్థితుల్లో వందకోట్లకు పైగా దేశ ప్రజలకు మోదీ.. టీకాలను అందించారన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

సైదాబాద్: బైక్‌పై నుంచి కిందపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూసలబస్తీకి చెందిన ఇంద్రాన్ (22) బుధవారం తెల్లవారుజామున బస్తీలో తన బైక్‌పై వెళ్తుండగా మూడుగుళ్ల చౌరస్తా సమీపంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి, ఆ తర్వాత మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పంచాయతీలలో ట్రాక్టర్లు నడపలేం

చేవెళ్ల: జీపీల నిర్వహణలో ఆర్థిక ఇబ్బందులతో పంచాయతీలో ఉన్న ట్రాక్టర్లను నడపలేమని కార్యదర్శులు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ విఠలేశ్వర్‌జీకి వారు వినతిపత్రం అందించారు. తమ పరిస్థితిని అర్థం చేసుకొని వెసులుబాటు కల్పించాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శంకర్‌పల్లి: ఫర్టిలైజర్ దుకాణదారులు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు విక్రయించే ఎరువులు, విత్తనాలకు సంబంధించి పక్కా రికార్డులను మెయింటెన్ చేయాలని, అదేవిధంగా రైతులకు విధిగా రశీదులు అందించాలన్నారు. డబ్బులకు ఆశపడి నకిలీ విత్తనాలను అమ్మితే జరిమానాతో పాటు కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ ఎన్.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆర్‌జీకే ఫీడర్ పరిధిలోని విశాఖనగర్, ఏఆర్‌సీఆర్ కాలనీ, ఆర్‌బీఆర్ కాలనీ, మారుతీనగర్, రాజీవ్‌గృహకల్ప, జయశంకర్‌కాలనీ, వసంతవిహార్, హనుమాన్‌నగర్, స్నేహహిల్స్, సప్తగిరికాలనీ, శ్రీమారుతీనగర్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ జనప్రియ ఎన్‌క్లేవ్ ఫీడర్ కింద ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీ, అయోధ్యనగర్ (ఓల్డ్, న్యూ), జనప్రియ మహానగర్ అన్ని బ్లాకుల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ ప్రకటనలో తెలిపారు. 11కేవీ హనుమాన్‌నగర్, కల్వం, మదర్ డెయిరీ, నేతాజీనగర్, గణేశ్‌నగర్, సీతారామపురం, ఖిల్లామైసమ్మ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ గౌటేటి ఫంక్షన్‌హాల్, డెంటల్ కళాశాల, వాసవికాలనీ, లక్ష్మీగణపతి, దేశ్‌ముఖ్‌కాలనీ ఫీడర్ల కింది కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో ఆటంకం కలగనుందని పేర్కొన్నారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి ప్రతిపాదనలు



పార్కులో పర్యటిస్తున్న అధికారులు, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, యూబీడీ డీడీ రుద్రనాథ్, ఏఈ కిరణ్, జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి బుధవారం డివిజన్‌లోని శాలివాహననగర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారు పార్కులో నెలకొన్న సమస్యలను పరిశీలించి అభివృద్ధి పనులపై చర్చించారు. పార్కులో టైల్స్, ఓపెన్ జిమ్, గ్రీనరీ, వాకింగ్ పాత్, మొక్కల పెంపకం, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్, పార్కు నిర్వహణ కమిటీ సభ్యులు అధికారులను కోరారు. చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి ఇరుశాఖల సమన్వయంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సుమారు రూ.50 లక్షల నిధులతో పార్కును అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కృష్ణకుమార్, పార్కు కమిటీ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, నూలి శ్రీధర్, నందు, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చైతన్యపురి: అన్నవర క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఆరురోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ దేవరం లింగారెడ్డి తెలిపారు. మొదటి రోజు ఉదయం 8 గంటలకు భక్తులు బహూకరించిన 108 వెండి కలశాలను పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి స్వామివారికి పంచామృతాలు, పూలతో అభిషేకం చేస్తారన్నారు. ఆదివారం శ్రీరమాసహిత శ్రీవీరవెంకటీ సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందన్నారు. అలాగే నిత్యం ఉదయం 7, 8, 10 గంటలు, సాయంత్రం 7 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తారన్నారు. బుధవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహాగుప్తా, చకిలం రమణయ్య, చిదర నాగేందర్, వక్కలంక శ్రీనివాస్‌రావు, బచ్చు సత్యనారాయణ, కుమారస్వామి, పాల్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లు, ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశం శివసేనారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్‌ల ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లోని అశోక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. పదవులు దక్కడం లేదని ఎవరూ అధైర్య పడొద్దని, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే తొలి ప్రాధాన్యత దక్కుతుందని పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులపై స్థానిక నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారని, నిరంతరం ప్రజల మధ్య ఉండే వారికే గుర్తింపు, పదవులు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సహా అధిష్టానం భావిస్తోందన్నారు. ఇక్కడి పార్టీ వ్యవహారాలను అగ్రనేత రాహుల్‌గాంధీ నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. పరిశీలకులను నియమించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, శంకర్‌యాదవ్, పున్న గణేష్, చిలుక ఉపేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పుట్టగల్ల జగన్, ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'భూభారతి'

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోండి: తహసీల్దార్ సైదులు



సిరిగిరిపురం సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టం తెచ్చిందని తహసీల్దార్ సైదులు అన్నారు. అందులో భాగంగానే ఊరూరా రైతు సదస్సులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భూ బాధిత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మండల పరిధి సిరిగిరిపురం గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. నాలుగు దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పావని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, రైతులు శ్రీనివాస్, వెంకటేశ్ గౌడ్, కొముర‌య్య, నర్సింహ పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆకన్‌పల్లిలో..

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నవత కోరారు. మండల పరిధి ఆకన్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వర్ణ కుమారి, జూనియర్ అసిస్టెంట్ నరేందర్, టైపిస్టు కల్పన, రికార్డు అసిస్టెంట్ లక్ష్మణ్ పలువురు రైతులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి



అల్మాస్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ అధికారులు

బడంగ్‌పేట్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పించి డబ్బులు ఆదా చేసుకోవాలని డిప్యూటీ డీఈఈ వెంకన్న అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. చిన్నారులకు ఆటాపాటతో విద్యాబోధన అందిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈఈ ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ ఎం.నిర్మల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి.జ్యోతి, ఉపాధ్యాయులు మీన, పద్మ ఉన్నారు.

పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించాలి

ఏబీవీపీ జిల్లా నాయకుడు సాయిచరణ్



డిపో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మహేశ్వరం: పెంచిన విద్యార్థుల ఆర్టీసీ బస్సు చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఏబీవీపీ జిల్లా నాయకులు సాయిచరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో మహేశ్వరం ఆర్టీసీ డిపో అధికారులకు చార్జీలను తగ్గించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. బస్‌పాస్ చార్జీలు పెంచడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులపై భారం పడుతుందని ఆరోపించారు. చార్జీలు తగ్గించేవరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారు హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుణవంత్, శ్రీకాంత్, వెంకటరమణ పలువురు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు అద్భుత గృహం



భోజనం వడ్డిస్తున్న న్యాయమూర్తి సుదర్శన్

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కోర్టు జడ్జి సుదర్శన్ తన పుట్టినరోజు వేడుకలను ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ గృహం అనాథ విద్యార్థులకు ఒక అద్భుత గృహమని విద్యార్థులకు అందమైన బిల్డింగు, అద్భుతమైన సౌకర్యాలు ముఖ్యంగా మంచి లైబ్రరీ ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, ఆడిటోరియం, స్టడీ హాల్ అన్ని సమకూర్చి వారిని ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిస్తూ బంగారు భవిష్యతకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం 120 మంది విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అష్టాదశ వార్షికోత్సవం



శ్రీ చక్ర అర్చన చేస్తున్న పండితులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అలకాపురిలో శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళీశ్వర అష్టాదశ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో శ్రీ శారదాంబ మహకాళీ అలంకరణ దర్శనం, గురుపాదుకా పూజ, వేదాపారాయణం, గోపూజ, శ్రీ చక్ర నవావరణార్చన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, దీక్షాధారణ, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మాధికారి కే.వీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, శోభనాద్రి, సుర్యానారాయణ శర్మ, గౌరి శంకర్, నర్సింహమూర్తి, శ్రీనివాస్ బంగారయ్య శర్మ పాల్గొన్నారు.